# విష్ణువు

విష్ణువు అనిన మాటకు అర్థము తెలియవలెనినచో మనమెచ్చటకు పోవలయును? విష్ణుమూర్తి అయిన వెంకటేశ్వరస్వామి వద్దకు కదా! ఆయన తిరుపతిలోనున్న ఏడుకొండలమీద వెలసి, అక్కడనుంచి క్రమముగా ఆంధ్ర దేశమంతయు, దక్షిణదేశము, ఉత్తరభారతముగూడ వ్యాపించినాడు. అచ్చటనుండి ఖండాంతరముల ప్రయాణ మారంభించి, లండను, న్యూయార్కు, పిట్సుబర్గు, లాసేంజలీసు మహానగరములలో గూడ వెలసినాడు. ఇకముందర ఎక్కడెక్కడ అవతరించునో చెప్పలేము.

ఆ విష్ణుమూర్తి నిష్పక్షపాతి కదా! అందువలన తన ఒక్క విగ్రహమునకే కాదు, ప్రపంచములో ఏ విగ్రహమునకైనను ఈ వ్యాపించు శక్తిని ప్రసాదించును. అందువలననే వాల్టు డిస్నీ స్టూడియోలలో పుట్టిన డోనాల్డు డక్కు, మిక్కీ మౌసులు అమెరికా దాటి, టోకియో, పారిసు నగరములకు పోగలిగినారు.

ఇది ఒక్క విగ్రహముల విషయమునందే కాదు. మతములు, భావములు కూడ అడుగు తరువాత అడుగు వేసికొనుచు ప్రయాణములు సేయుట మనము చూచుచున్నాము. బుద్ధగయలో పుట్టిన బౌద్ధమతముచైనా, ఇండోనీషియా, కంబోడియా, జపానులను వ్యాపించినది. బ్రిటిష్‌వారి పార్లమెంటులో పుట్టిన ప్రజాతంత్రభావము ఇప్పుడు అనేకములైన దేశములలో, రాజ్యము సేయుచున్న భావములను – మీరు తప్పుకొనుడు. నేను రాజ్యము సేతుననుచున్నది.

సముద్రమునందు పుట్టిన ఆవిరి విస్తరిల్లి, ఆకసమును జేరుచున్నది. వాయువు సంగతి చెప్పనక్కరలేదు. అగ్ని కూడ నంతియే. ఎక్కడో చిన్న రవ్వగా నుద్భవించును. మహారణ్యములను రోజుల తరబడి దగ్ధముసేయు స్థితిని పొందును.

గింజ పెరిగి మొక్క అగుచున్నది. ఆ మొక్క మహావృక్షమగుచున్నది. తల్లి గర్భమునందున్న పిండము శిశువగుచున్నది. ఆ శిశువు పెరిగి పెద్దవాడగుచున్నాడు. మనలోన ఎచ్చటనో ఒక చిన్న ఊహ పుట్టి, అది మనస్సునుజేరి, కోరిక యగుచున్నది. ఆ కోరిక దృఢమై, శరీరమునందు ఆచరణరూపమును పొందుచున్నది. ఆ జరిగిన కార్యము ఎంత పెద్దది అగునో, ఎంతకాలము నిలచి ఉండునో గూడ చెప్పలేనంత పెద్దది కావచ్చును. అగుచున్నది. కాళిదాసు హృదయమునందలి ఒక రమణీయ సుక్ష్మభావము విస్తరిల్లి ప్రపంచమునందలి ఒక మహానాటకమైన శాకుంతలముగా కాలమును దాటి నిలచినది. శంకర భగవత్పాదుని మనస్సులోని కోరిక సకల భరతావనిని బ్రహ్మజ్ఞానము వంకకు తిప్పినది. నాలుగు దిక్కులందు నాలుగు పీఠములను స్థాపించినది. జెమ్‌షెడ్జీ తాతా గుండెలోని ఊహ భారతదేశమున పారిశ్రామిక ప్రపంచమును కల్పించినది. ఇన్ని మాటలెందుకు? మనము చూచుచున్న ఈ పృథివి,ఈ జ్యోతిర్గోళములు,

ఈ విశ్వమంతయు సృష్టి ఆరంభమైన వేళ(at the time of big bang) అణువుకన్న సూక్ష్మమైనది కదా! అసలచ్చట అణువు యొక్క భాగము (atomic sub-particle) కూడ ఉన్నదో లేదో అని అనుమానము కదా!

ఈ విప్పారుటను, ఈ వ్యాప్తిని వేదము "విష్ణువు" అనుచున్నది. ఈ శక్తి మానవుని చేతిలో లేదు. అందువలన దేవతాశక్తి. ఈ సృష్టి (Creation), ఈ విశ్వము (Universe) ఈ విధముగా నుండుటకు ప్రధానమైన కారణములైన శక్తులలో విష్ణుశక్తి ఒకటి. విష్ణుశబ్దము "విశ్" అనిన ధాతువు (root) నుండి పుట్టినది. "విశ్" అనగా "వ్యాపించు" అని అర్థము (to pervade). "విష్ణు" శబ్దమును మరియొక ధాతువునుండి గూడ సాధింపవచ్చును. వ్య+అశ్ – అనగా లోనికి చొచ్చు (penetrate) అని అర్థము. ఈ విష్ణుశక్తి లోనికి చొచ్చి వ్యాపించుచున్నది.లోనుండి అన్నివంకల సమానముగ పెరుగుటవలననే చిన్న ఆకునకును, పెద్ద ఆకునకును ఆకారములో భేదము లేదు. పసివానికిని,పెద్దవానికిని రూపములో మార్పు లేదు. వేదమేదైన శబ్దము వాడినదనగా, ఆ శబ్దమునకున్న అర్థములచేత, మన మనస్సునందు ఆ దేవతా శక్తి లక్షణములన్నియును స్ఫురింపజేయును. వేదమంత శాస్త్రీయమైన గ్రంథము.

ఈ దేవతాశక్తులను గూర్చి చెప్పునది ఋగ్వేదము. అవి చేయుపనులను చెప్పునది యజుర్వేదము. ఆ పనుల వలన సృష్టి ఎట్లు మారుచున్నదో, అనగా ఆ పనులవలన కలిగెడి ఫలితములను తెలుపునది సామవేదము. ఇట్టి శక్తులకు మూలమై, ఈ శక్తులను వాటివాటి పనులను చేయుటకు కారణమైన "మహాచైతన్యమును" లేక బ్రహ్మమును గూర్చి, ఆ బ్రహ్మమునకును, ఈ సృష్టికిని ఉన్న సంబంధమును చెప్పునది అథర్వణవేదము.

కనుక విష్ణుశక్తిని గూర్చి తెలుసుకొనదలచినచో, ఋగ్వేదమునందు చూడవలెను. విష్ణుశక్తి **విచక్రమమైనది.** విచక్రమమనగా అంచెలంచెలుగా సాగుట. ఈ విష్ణుశక్తి తక్కిన దేవతాశక్తులయందుగూడ ప్రవేశించును ఎందువలన అనగా, ఆ శక్తులుగూడ విశ్వమంతయు వ్యాపించి, వారి పనులు సేయవలయునుగదా!తక్కిన దేవతాశక్తులయందును, పృథివి యందును, సృష్టిలో జరుగు అన్ని మార్పులయందును, విచక్రముగా నుండునది విష్ణుశక్తి[1]. పృథ్వీలోకము నందు, సూర్యాది గోళములుండు అంతరిక్షమునందు, దేవతాశక్తులుండుటచేత దేవలోకము నందును – ఈ మూడు లోకములందును, మూడుపాదములై (భాగములై)[2] విచక్రమించునది విష్ణుశక్తి. మనయందున్న మూడు శరీరములందున (జ్ఞాన, సూక్ష్మ, భౌతిక) గూడ విచక్రమించి ఉండును.

ఈ శక్తులకు కన్ను, ముక్కులున్న వనిగాని, మానవరూపములున్నవనిగాని, వేదమెక్కడను చెప్పలేదు. భూమ్యాకర్షణశక్తి (gravity) అయస్కాంత శక్తి (magnetism) వంటివీ శక్తులు. భూమ్యాకర్షణాది శక్తులు పదార్థమునుగాని, శరీరమునుగాని, బయటనుండి మార్చుటకు ప్రయత్నించును. వేదమునందు చెప్పబడిన శక్తులు లోపలనుండి తమ ప్రభావమునుచూపి, మార్పులు కలుగజేయును.

వేదమునందున్న భావములను అందరకు తెలియజేయుట కొరకు పురాణకర్తలు – ముఖ్యముగా వ్యాసముని, ఈ దేవతాశక్తులను వేరువేరు "విగ్రహములను" జేసి, వారికి ఆయా దేవతాశక్తులను గుణములు జేసి కథల నల్లెను. వేదము చెప్పిన విష్ణుశక్తి సర్వాంతర్యామి. మూడు పాదములతో మూడు లోకముల నాక్రమించెను. పాదమునకు భాగము – అంశము, అను అర్థము గాక, కాలి పాదమను అర్థము చెప్పుట వలన, విష్ణువు దేవుడై, వామనావతార కథ సృష్టింపబడెను. ఇది వేదమునుండి పురాణములుద్భవించిన తీరు.

గురువు శిష్యునకు పాఠము చెప్పునపుడు, తన జ్ఞానమునా శిష్యునకు పంచుచున్నాడు. తనయందా జ్ఞానము లేనిచో గురువు, గురువుకాదు. సకలదేవతాశక్తుల సంపూర్ణజ్ఞానమా వేదమందు లేనిచో, ఆయాశక్తి స్వరూపములను అంత విపులముగా బోధింపలేదు. అన్ని శక్తులా మహా జ్ఞానమునుండి (బ్రహ్మమునుండి) పుట్టుచున్నవి గదా! కనుక జ్ఞానమే శక్తి. వేదము సకల జ్ఞాన సంపుటి. అనగా అన్ని శక్తులందున్నవి. విష్ణుశక్తి గూడ ఉన్నది. అందువలననే వేదము, భాష్యములుగా (వ్యాఖ్యానములుగా), ఆరు వేదాంగములుగా, 18 పురాణములుగా, న్యాయశాస్త్రముగా, మీమాంసగా, ధర్మసూత్రములుగా, వృత్తులుగా, కారికలుగా విష్ణుత్వమందినది. ఇన్ని యుగములనుండి, గురుశిష్య పరంపరగా, సృష్టిని వ్యాఖ్యానించుచు, విచిత్రమ రూపమును చూపుచున్నది. వేదస్వరూపమును గూర్చి ఆలోచించినంత మాత్రముననే "విష్ణు" స్వరూపమవగాహనమగును.